ట్రాఫిక్ పోలీసుల్లో గుబులు

- ఉలిక్కిపడిన ద్వారకా ట్రాఫిక్ పోలీస్ స్టేషన్
- ఎస్ఐ సస్పెన్షన్‌తో తీవ్ర దుమారం


ద్వారకా ట్రాఫిక్ పోలీస్ స్టేషన్

సీతమ్మధార: ద్వారకా జోన్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సిబ్బంది గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. ద్వారకా ట్రాఫిక్ ఎస్ఐ ఎస్.వి.భాస్కరరావు అవినీతికి పాల్పడి సస్పెండ్ కావడం తెలిసిందే. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో లంచం తీసుకున్నట్టు ఫిర్యాదు అందడం, విచారణలో నిర్ధారణ కావడంతో నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ఎస్ఐ భాస్కరరావు, స్టేషన్ రైటర్ జయరావులను సస్పెండ్ చేశారు. దీంతో ద్వారకా ట్రాఫిక్ స్టేషన్ సిబ్బందిలో గుబులు చెలరేగింది.

అవినీతి ఆరోపణల వెల్లువ

ట్రాఫిక్ పోలీసుల అవినీతి చాపకింద నీరులా చల్లగా సాగిపోతోందని పలువురు విమర్శిస్తున్నారు. ఆయా జంక్షన్లలో ఆటో డ్రైవర్లే పోలీసులకు దళారులుగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రోడ్డు నిబంధనలు ఉల్లంఘించే లారీ డ్రైవర్లే లక్ష్యంగా ట్రాఫిక్ పోలీసులు రెండు చేతులా సంపాదిస్తున్నారని ఆరోపణలు ఉండనే ఉన్నాయి. ఆయా ప్రాంతాల్లో నిషేధ వేళల్లో వచ్చినా, ఓవర్ లోడ్ వేసినా పోలీసులకు లంచాలు ఇవ్వాల్సిందే. పోలీసులు నేరుగా లంచాలు తీసుకుంటారనుకుంటే పొరపాటు పడినట్టే. సమీపంలోనే ఉన్న ఆటో డ్రైవర్లను మచ్చిక చేసుకుని మరీ అక్రమార్జనకు తెర తీస్తున్నారని ఎన్నో ఏళ్లుగా ఆరోపణలున్నాయి. ఆయా ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఉండటంతో జాగ్రత్త పడుతున్న ట్రాఫిక్ పోలీసులు ఆటో డ్రైవర్లు, ఇతర దళారుల సాయంతో తమకు రావాల్సిన లంచాలను ఎంచక్కా అందుకోవడం తీవ్ర దుమారం రేపుతోంది.

ఇటు ద్వారకా.. అటు త్రీ టౌన్

ద్వారకా ట్రాఫిక్ ఎస్ఐ ఎస్.వి.భాస్కరరావు త్రీ టౌన్‌లో ఎటాచ్‌మెంట్‌పై విధులు నిర్వహిస్తూ డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో అవినీతికి పాల్పడుతూ సస్పెండ్ అయ్యారు. దీంతో ఇటు ద్వారకా ట్రాఫిక్.. అటు త్రీ టౌన్ ట్రాఫిక్ సిబ్బందిలో గుబులు రేగుతోంది. బయటకు వచ్చింది డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు మాత్రమేనని, బయటకు రాని లంచాల బాగోతాలు ఇంకా ఎన్నో దాగున్నాయోనని పలువురు పేర్కొంటున్నారు. నిత్యం రోడ్డు నిబంధనలు ఉల్లంఘించే వాహన చోదకులపై ట్రాఫిక్ పోలీసులు ఒంటి కాలి మీద విరుచుకు పడుతుండటం సర్వత్రా విమర్శలకు తావిస్తోంది.

ఫ్రెండ్లీ పోలీసింగ్ ప్రశ్నార్థకం..?

పోలీస్ ఉన్నతాధికారులు ఫ్రెండ్లీ పోలీసింగ్ అంటూ పదే పదే హితబోధ చేస్తున్నా.. దిగువ స్థాయి ట్రాఫిక్ పోలీసులు, సిబ్బంది వాహన చోదకులతో ఏక వచనంతో దురుసుగా మాట్లాడటం కూడా చూపరులకు ఆగ్రహం తెప్పిస్తోంది. ఎండనకా.. వాననకా కష్టపడి విధులు నిర్వహిస్తున్న నిజాయితీ పోలీసులు కూడా ట్రాఫిక్ విభాగంలో ఉన్నారన్నది నిర్వివాదాంశం. అవినీతికి పాల్పడుతున్న కొందరు ట్రాఫిక్ పోలీసుల వల్ల ఫ్రెండ్లీ పోలీసింగ్ వ్యవస్థ భ్రష్టుపడుతోందని, ఉన్నతాధికారులు తగు చర్యలు తీసుకోవాలని నగర ప్రజలు సూచిస్తున్నారు.

24న 'రన్ ఫర్ అంబేడ్కర్'


టీషర్టులు ఆవిష్కరిస్తున్న భీమ్‌సేన అధ్యక్షుడు రవి సిద్ధార్థ తదితరులు

సీతంపేట: రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా భీమ్‌సేన ఆధ్వర్యంలో ఈ నెల 24న రన్ ఫర్ అంబేడ్కర్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం.రవి సిద్ధార్థ తెలిపారు. రామాటాకీస్ రోడ్‌లోని అంబేడ్కర్ భవన్‌లో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదివారం ఉదయం 6 గంటలకు ఆర్కే బీచ్ కాళీమాత ఆలయం నుంచి కిర్లంపూడి బీచ్‌రోడ్ వైఎంసీఏ వద్ద గల పెరియార్ విగ్రహం వరకు రన్ కొనసాగుతుందన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ హాజరవుతారని తెలిపారు. డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ రాజ్యాంగాన్ని 1949వ సంవత్సరంలో నవంబరు 26న నాటి రాజ్యాంగ పరిషత్‌కు అందజేసిన రోజున రాజ్యాంగ దినోత్సవం జరుపుకొంటున్నట్టు తెలిపారు. ఈ ఏడాది పదో సారి భీమ్‌సేన ఆధ్వర్యంలో రన్ నిర్వహిస్తున్నట్టు తెలియజేశారు. అనంతరం రన్‌లో పాల్గొనే వారి కోసం అంబేడ్కర్ చిత్రంతో రూపొందించిన టీషర్టులను ఆవిష్కరించారు. సమావేశంలో భీమ్‌సేన నాయకులు శ్రీకాంత్, జ్ఞానశివకుమార్, రవితేజ, రావణ్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

పోర్టు హాస్పిటల్ ప్రైవేటీకరణ టెండర్లు రద్దు చేయాలి


దీక్షలో పాల్గొన్న సీఐటీయూ నాయకులు

తాటిచెట్లపాలెం: పోర్టు హాస్పిటల్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా హాస్పిటల్ ఎదురుగా సీఐటీయూ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహారదీక్షలు శుక్రవారానికి 53వ రోజుకు చేరాయి. దీక్షల్లో సీఐటీయూ (పోర్ట్ వీడీఎల్‌బీ అండ్ డాక్ వర్కర్స్ యూనియన్) నాయకులు దీక్షలో పాల్గొని, నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షుడు జక్కన సత్యనారాయణ మాట్లాడుతూ పోర్టు హాస్పిటల్ ప్రైవేటీకరణకు సంబంధించిన టెండర్లు పూర్తిగా రద్దు చేయాలని, పోర్టు హాస్పిటల్‌ను పోర్టు యాజమాన్యమే నిర్వహించాలని డిమాండ్ చేశారు. టెండర్ల ప్రక్రియను నవంబరు 8న, 22న ప్రారంభించాలని చూశారని, ఇప్పుడు దానిని ఈ నెల 28వ తేదీకి వాయిదా వేశారని అన్నారు. వాయిదా వేయడం కాదు, టెండర్లను కార్మికుల సంక్షేమం కోసం పూర్తిగా రద్దు చేయాలని కోరారు. ప్రభుత్వ ఆస్తులను ప్రైవేటువ్యక్తుల చేతుల్లో పెట్టడం వలన లాభాల కంటే నష్టాలే ఎక్కువని కాగ్ నివేదికల ద్వారా తెలుస్తుందన్నారు. పోర్టు హాస్పటల్ ప్రైవేటీకరణ నిర్ణయం పూర్తిగా ఉద్యోగుల హక్కులను, వారి కుటుంబాల ఆరోగ్య భద్రతను క్షీణింపచేసేదిగా ఉందని విమర్శించారు. అన్ని యూనియన్లు దీనిని తీవ్రంగా వ్యతిరేకించడంతో ఈ టెండర్ల ప్రక్రియను ఇప్పుడు నవంబరు 28వ తేదీకి వాయిదా వేశారని, ఎట్టి పరిస్థితుల్లోను తాము ఒప్పుకోబోమని స్పష్టం చేశారు కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు బి.లక్ష్మణరావు, కె.సత్యనారాయణ, రెడ్డి, ఆర్.ఎస్.మూర్తి, రాఘవులు, శ్రీనివాసు, కనకరాజు, శంకర్రావు తదితరులు పాల్గొన్నారు.

గౌరమ్మకు సారె సమర్పణ


గౌరమ్మకు సమర్పించిన సారెతో భక్తులు

సీతంపేట: శ్రీగౌరీ పరమేశ్వరుల సారె ఊరేగింపు మేళతాళాలతో ఘనంగా నిర్వహించారు. అక్కయ్యపాలెం రామకృష్ణానగర్‌లోని కాళ్లవారి తోట నుంచి గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో ఏటా గౌరీ పరమేశ్వరులకు సారె సమర్పిస్తుంటారు. ఈ ఏడాది కూడా గవర కులస్తులంతా శుక్రవారం అమ్మవారికి సారె సమర్పించారు. స్థానిక రామలింగేశ్వరాలయం నుంచి ప్రారంభమైన సారె ఊరేగింపు శంకువానిపాలెం, ఎన్‌టీ స్కూల్, అక్కయ్యపాలెం మెయిన్‌రోడ్, మహారాణిపార్లర్ కూడలి మీదుగా, జగ్గారావు బ్రిడ్జి వద్ద నెలకొల్పిన గౌరీపరమేశ్వరుల మండపం వరకు సాగింది. గ్రామ ప్రజలు, మహిళలు పెద్ద సంఖ్యలో ఊరేగింపులో పాల్గొని మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో గౌరీ సంఘం అధ్యక్షుడు కాళ్ల సూర్యప్రకాష్, బొడ్డేటి రవికుమార్, కొణతాల గోవింద్, కిరణ్, నాగేశ్వరరావు, వెంకటరావు, భాగ్యలక్ష్మి, మహాలక్ష్మి, పైడిరాజు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన


షాపు యజమానులకు ప్లాస్టిక్ నిషేధం గురించి వివరిస్తున్న సిబ్బంది

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డు పరిధి నరసింహనగర్‌లో జీవీఎంసీ, సచివాలయ శానిటేషన్ సిబ్బంది ప్లాస్టిక్ నిషేధంపై వ్యాపారులకు, వర్తకులకు శుక్రవారం అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ సంచులను పూర్తిగా నిషేధించారని సూచించారు. 120 మైక్రాన్ల కంటే తక్కువ గల ప్లాస్టిక్‌ను వినియోగిస్తే భారీ జరిమానా విధిస్తామని, దీనికి ప్రత్యామ్నాయంగా వస్త్రసంచులు తెచ్చుకోవాలని తెలిపారు. నరసింహనగర్‌లోని కిరాణా, జనరల్ షాపులకు, తోపుడుబండ్లు, చిరువ్యాపారులకు వీటిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్ యాదవ్, సచివాలయ సెక్రటరీలు అలీమా, నానాజీ, రమణ, శివ, ఫాతిమా, సూపర్‌వైజర్ సుభానీ, ప్రసాద్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కార్మికులు భద్రతా చర్యలు పాటించాలి

- ఈస్ట్ ఏసీపీ లక్ష్మణమూర్తి
- ఇనార్బిట్ మాల్‌లో భవన నిర్మాణ కార్మికులకు సూచనలు


సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ లక్ష్మణమూర్తి

సీతమ్మధార: ఇనార్బిట్ మాల్ ఆవరణలో భద్రతా చర్యలు తీసుకోవాలని ఈస్ట్ ఏసీపీ కె.లక్ష్మణమూర్తి సూచించారు. నగరంలోని పోర్టు హాస్పిటల్ సమీపంలో ఉన్న ఇనార్బిట్ మాల్ నిర్మాణ కార్మికులతో సీఐ ఎస్.విజయ్‌కుమార్‌తో కలిసి శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నిర్మాణ పనులు జరుగుతుండగా కార్మికులు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. మొబైల్ ఫోన్ వల్ల వచ్చే అనర్థాలు, ఏటీఎం వద్ద జరిగే మోసాలు, మాదక ద్రవ్యాల వినియోగం వంటి నేరాలకు విధించే శిక్షల గురించి తెలియజేశారు.

సమస్య వస్తే సంప్రదించండి

యాజమాన్యం వలన గాని, ఇతర కారణాల వలన గాని కార్మికులకు ఏ విధమైన సమస్య వచ్చినా పోలీసులు ఎల్లవేళలా అందుబాటులో ఉంటారని తెలియజేస్తూ, ఫోర్త్ టౌన్ సీఐ నంబర్ వారికి తెలిపారు. వారు సకాలంలో స్పందించకుంటే నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చికి 79950 95799 నంబర్‌లో ఫిర్యాదు చేయవచ్చన్నారు. భద్రతకు సంబంధించి ఇనార్బిట్‌మాల్ మేనేజ్‌మెంట్‌కు సూచనలు చేశారు. కార్యక్రమంలో సుమారు 500 మంది భవన నిర్మాణ కార్మికులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

బహిరంగ సభను విజయవంతం చేద్దాం

ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పోస్టర్ విడుదల


పోస్టర్ విడుదల చేస్తున్న ఏఐటీయూసీ నేతలు మన్మథరావు, రెహమాన్ తదితరులు

సీతమ్మధార: కార్మికులకు, రైతులకు వ్యతిరేకంగా ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై ఈ నెల 26న దేశవ్యాప్తంగా నిర్వహించనున్న ర్యాలీలు, బహిరంగ సభలను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఎం.మన్మథరావు, ఉపాధ్యక్షుడు షేక్ రెహమాన్ కోరారు. కార్యక్రమాలకు సంబంధించిన పోస్టర్‌ను జీవీఎంసీ గాంధీ పార్కులో శుక్రవారం విడుదల చేశారు. వారు మాట్లాడుతూ వివిధ రంగాల్లో పనిచేస్తున్న అసంఘటిత రంగాల కార్మికులకు భద్రతతో కూడిన సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఆశ, అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజన కార్మికులకు కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల ప్రకారం జీతాలు పెంచి, వారందరినీ పర్మినెంట్ చేయాలని కోరారు. స్టీల్‌ప్లాంట్‌కు సొంతగనులు కేటాయించి, సెయిల్‌లో విలీనం చేయాలన్నారు. రైతులకు పంటలకు గిట్టుబాటు ధర ఇవ్వాలన్నారు. పెట్రోల్, డీజిల్ ధరలను జీఎస్టీ పరిధిలోకి తేవాలని లేదా వాటి ధరలపై కేంద్రప్రభుత్వ నియంత్రణ ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. ఈ నెల 26న ఉదయం 10 గంటలకు డీఆర్ఎం ఆఫీస్ నుంచి అఖిలపక్ష కార్మిక సంఘాలు, ప్రజా సంఘాలు, కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో మహా ప్రదర్శన, అనంతరం జీవీఎంసీ గాంధీ పార్క్‌లో జరిగే బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్.కాసుబాబు సీహెచ్.సాయి, ఏఐటీయూసీ జిల్లా సమితి సభ్యులు ఎస్.నాగేశ్వరరావు, బి.రాము, బి.విజయ్, రవికాంత్ తదితరులు పాల్గొన్నారు.

మానసిక దివ్యాంగురాలికి ఆశ్రయం

- నెల్లూరు నుంచి విశాఖ వచ్చేసిన యువతి


నెల్లూరుకు చెందిన హర్షిత

సీతమ్మధార: నెల్లూరుకు చెందిన 18 ఏళ్ల మానసిక దివ్యాంగురాలు హర్షితకు విశాఖలో ఆశ్రయం కల్పించారు. కంట్రోల్ రూమ్ పోలీసులు ఇచ్చిన సమాచారంతో ఫోర్త్ టౌన్ నైట్ బీట్ సిబ్బంది ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో యువతిని కనుగొని వివరాలు ఆరా తీశారు. తన పేరు హర్షిత అని, సొంతూరు నెల్లూరు జిల్లా నుంచి 14 రోజుల కిందట విశాఖ వచ్చేసినట్లు చెప్పింది. ఆరు రోజుల కిందట జీఆర్పీ పోలీసులు హర్షితను గుర్తించి టీఎస్సార్ కాంప్లెక్స్‌లోని జీవీఎంసీ నిరాశ్రయుల వసతి గృహంలో ఉంచగా.. అక్కడ నుంచి వచ్చేసి, తిరిగి ఎక్కడికి వెళ్లాలో తెలియక ఇబ్బంది పడుతుండగా.. ఫోర్త్ టౌన్ పోలీసులు సంరక్షించారు. అమ్మాయి తల్లిదండ్రుల వివరాలు, ఫోన్ నంబర్ తెలుసుకొని సమాచారం అందించామని, వారు నెల్లూరు నుంచి బయలుదేరి వస్తున్నట్లు ఫోర్త్ టౌన్ పోలీసులు తెలిపారు. అంతవరకు హర్షితను ఉమెన్ పోలీస్ సహాయంతో ద్వారకా పోలీస్ స్టేషన్‌కు అప్పగించామన్నారు.

రహదారిలో నిర్మాణంపై చర్యలు తీసుకోండి


రహదారిని ఆక్రమించి నిర్మిస్తున్న ఇంటి ఫొటోలు చూపిస్తున్న బాధితులు

సీతంపేట: నలుగురు నడిచే రహదారిని ఆక్రమించి ఇల్లు నిర్మిస్తున్నారని, ఇదేంటని అడిగితే బెదిరింపులు, దాడులకు పాల్పడుతున్నారని గోడి కృష్ణ కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. శాంతిపురంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాధితులు మాట్లాడారు. జీవీఎంసీ 25వ వార్డు సీతంపేట రాజేంద్రనగర్‌లోని 50-64-23 ఇంటి నంబర్ వద్ద సందులో అందరూ నడవడానికి ఆరడుగుల రోడ్డును మినహాయించాల్సి ఉండగా.. ఒక వ్యక్తి మాత్రం తన ఇంటి వద్ద రహదారిని విడిచి పెట్టకుండా ఇల్లు కడుతున్నాడని తెలిపారు. స్థానికుల ఫిర్యాదుతో జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకున్నా.. పనులు ఆపకుండా యథావిధిగా చేపడుతున్నారన్నారు. రహదారిలో నిర్మాణాలు చేపట్ట వద్దని విశాఖ కోర్టు ఇంజక్షన్ ఆర్డర్ ఇచ్చిందని గుర్తుచేశారు. సంబంధిత అధికారులు స్పందించి అక్రమ నిర్మాణంపై తగు చర్యలు చేపట్టి కోరారు. సమావేశంలో బాధిత మహిళలు రజని, సుజాత, మణి పాల్గొన్నారు.

మాతృ మరణాలు సంభవిస్తే కఠిన చర్యలు


మాతృ మరణాలపై సమీక్షిస్తున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

మహారాణిపేట: మాతృ మరణాలు సంభవించకుండా చర్యలు తీసుకోవాలని, లేదంటే సంబంధిత వైద్యులు, సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు హెచ్చరించారు. శుక్రవారం రేసపువానిపాలెంలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో మాతృ మరణాలపై ఆయన అధ్యక్షతన జరిగిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో ఇటీవల రెండు మాతృ మరణాలు సంభవించాయని, వాటిపై సంబంధిత వైద్యులు, ఆరోగ్య సిబ్బంది కారణాలు చెప్పాలని కోరారు. వీటిపై యూపీహెచ్‌సీ వైద్యులు, ఏఎన్‌ఎంలతో చర్చించారు. లక్ష్మీనగర్ పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలో ఒకటి, స్వర్ణభారతి పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధి న్యూపిఠాపురం కాలనీలో ఒక మాతృ మరణం సంభవించాయని అన్నారు. గర్భిణిగా నమోదు అయినప్పటి నుంచి ప్రసవించే వరకు, ప్రసవానంతరం సైతం సక్రమ సేవలందించాలని తెలిపారు. ఈ సమీక్షలో జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారి డాక్టర్ గౌరీ శంకర్, ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ ఎస్.జీవన్‌రాణి, మీడియా విస్తరణాధికారి (డెమో) బి.నాగేశ్వరరావు, కేజీహెచ్ గైనకాలజిస్ట్ డాక్టర్ షర్మిల, డాక్టర్ రేణుక, విక్టోరియా ఆస్పత్రి గైనకాలజిస్టు డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ రేణుక, డాక్టర్ జి.వి.గణేష్, డాక్టర్ సి.బి.నాయుడు, బ్లడ్ బ్యాంకుకు చెందిన ఐ.మనోరమ, 108 సేవల జిల్లా మేనేజర్ త్రినాథ్, పట్టణ ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్లు, పినాకిల్ ఆస్పత్రి, కృష్ణ మెటర్నిటీ ఆస్పత్రి, జ్యోతి నర్సింగ్ హోం వైద్యులు, ఆరోగ్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

డెంగ్యూ బాధితుల ఇళ్లకు డీఎంహెచ్‌వో


శ్రీనివాసనగర్‌లో ఒక ఇంటి వద్ద నీటి నిల్వలు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

మహారాణిపేట: అక్కయ్యపాలెం శ్రీనివాసనగర్‌లో డెంగ్యూ పాజిటివ్ కేసులు నమోదైన ఇళ్లను శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి(డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు సందర్శించారు. కుటుంబ సభ్యుల వివరాలు, దోమల వృద్ధికి కారణాలు, నివారణ మార్గాలను వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రాంతాల్లో నీటి నిల్వలు లేకుండా చూడటం, ఫ్రైడే-డ్రైడే కార్యక్రమంపై అవగాహన కల్పించడం వంటి చర్యలు చేపట్టారు. దోమల ద్వారా డెంగ్యూ వంటి జ్వరాలు సంభవిస్తాయని, దోమలు వృద్ధి చెందకుండా ప్రజలు సహకరించాలని డీఎంహెచ్‌వో కోరారు. నరసింహనగర్, శివనగర్, భవానీ గార్డెన్స్ ప్రాంతాల్లోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆకస్మికంగా ఆయన సందర్శించారు. అక్కడ స్థానికులకు డెంగ్యూ, ఫ్రైడే-డ్రైడే కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం రేపు

మురళీనగర్: మురళీనగర్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో బ్రిందా ఆస్పత్రి సహకారంతో ఈ నెల 24న వాకర్స్ పార్కులో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు వాకర్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు పల్లా చంద్రమౌళి, పి.చెల్వరాజు ఒక ప్రకటనలో తెలిపారు. బ్రిందా ఆస్పత్రి రీసెర్చ్ సెంటర్ క్యాన్సర్ వైద్య నిపుణుడు డాక్టర్ పి.వంశీధర్, జనరల్ మెడిసిన్, మెడికల్ ఆంకాలజీ స్పెషలిస్ట్ డాక్టర్ పి.విజయలక్ష్మి, ఆర్థోపెడిక్ నిపుణుడు డాక్టర్ వి.అచ్యుత రమేష్, జనరల్ మెడిసిన్ డాక్టర్ ఎస్.సంజన పాల్గొంటారని చెప్పారు. ఈసీజీ, ఆర్‌బీఎస్, బీపీ, ఇతర వైద్య పరీక్షలు చేస్తారన్నారు.

నేడు వైభవుడికి సుప్రభాత సేవ



మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం సుప్రభాత సేవ నిర్వహిస్తారు. తెల్లవారుజామున సన్నిధిగొల్ల సేవ చేసి, సుప్రభాతం చదివి వినిపిస్తారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేస్తారు. ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్ఠి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్ర నామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన జరుగుతాయి. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేస్తారు. సాయంత్రం 6.30 గంటలకు వైభవుడికి విశేష హారతులు సమర్పిస్తారు.

సైకిల్ యాత్రికులకు శివాలయంలో బస


సైకిల్ యాత్రికులకు స్వాగతం పలుకుతున్న ఆలయ కమిటీ సభ్యులు, నాయకులు

తాటిచెట్లపాలెం: యువకులు సైతం సైకిల్ తొక్కేందుకు ఆలోచిస్తున్న ఈ రోజుల్లో ఇద్దరు వృద్ధులు వేలాది కిలోమీటర్లు సైకిల్‌పై తిరుగుతూ ఆదర్శంగా నిలుస్తున్నారు. మహారాష్ట్ర, సోలాపూర్ నుంచి పూరికి సైకిల్‌పై వెళ్లి దర్శించుకుని, తిరుగు ప్రయాణంలో తమ స్వగ్రామానికి పయనమైన యాత్రికులు శ్రీశైల నాలె(65), విట్టల్ ఖాదమ్(79)కు తాటిచెట్లపాలెం ఉమా రామలింగేశ్వరాలయంలో శుక్రవారం రాత్రి బస ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ సభ్యుడు పైడి రమణ సూచనలతో కమిటీ సభ్యులు వీరికి ఘన స్వాగతం పలికి బస ఏర్పాట్లు చేశారు. వీరు శనివారం ఉదయం తిరిగి సైకిల్ యాత్ర ప్రారంభించనున్నారు. నాగరాజు, సిమ్మారావు, రామారావు, లక్ష్మీనారాయణ, హరిపట్నాయక్, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

26న సనాతన ధర్మంపై సదస్సు


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న బొడ్డు కల్యాణరావు, జె.వి.ప్రభాకర్

సీతంపేట: రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 26న రామాటాకీస్ రోడ్డులోని అంబేడ్కర్ భవన్‌లో 'సనాతన ధర్మమా - సమ ధర్మమా' అనే అంశంపై సదస్సు నిర్వహించనున్నట్లు డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు బొడ్డు కల్యాణరావు, జె.వి.ప్రభాకర్ తెలిపారు. అంబేడ్కర్ భవన్‌లో శుక్రవారం కార్యక్రమ కరపత్రాలను వారు ఆవిష్కరించి మాట్లాడారు. ప్రస్తుతం ప్రజల్లో సనాతన ధర్మంపై చర్చ ఎక్కువగా జరుగుతోందని, ఈ అంశంపై బీజేపీ గాని, ఆర్ఎస్ఎస్‌గాని ఎలాంటి స్పష్టత ఇవ్వలేదన్నారు. భారత రాజ్యాంగం మనుషుల మధ్య సమానత్వం అమలు చేస్తున్న సందర్భంలో రాజ్యాంగాన్ని మార్చివేసే ప్రమాదం కనిపిస్తోందన్నారు. సదస్సులో ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ సి.కాశీం ముఖ్య అతిథిగా ప్రసంగిస్తారని, అంబేడ్కరీయులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఈసీ సభ్యులు ఆర్.సరస్వతి పాల్గొన్నారు.

అలరించిన కర్ణాటక గాత్ర కచేరీ


కీర్తనలు ఆలపిస్తున్న గాయని లక్ష్మీశైలజ

సీతంపేట: లలితానగర్ శ్రీలలితా పీఠంలో శుక్రవారం జరిగిన కర్ణాటక గాత్ర కచేరీ ఆహుతులను అలరించింది. ద్వారం త్యాగరాజు శిష్యురాలు అక్కినపల్లి లక్ష్మీశైలజ అద్భుత గానంతో త్యాగరాజ, అన్నమయ్య, ముత్తుస్వామి కీర్తనలు ఆలపించి వీనులవిందు చేశారు. ఈమెకు వయోలిన్‌పై సరస్వతుల పార్థివ, మృదంగంపై చైతన్య తలాడ వైద్య సహకారం అందించారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ గాయనిని సత్కరించి అభినందించారు.

క్లుప్తంగా

సేఫ్టీ కోర్సు విద్యార్థులకు మెటీరియల్ పంపిణీ


స్టడీ మెటీరియల్ అందజేస్తున్న గైస్ ప్రిన్సిపాల్ వెంకటరమణ

మురళీనగర్: కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ ఇన్‌స్టిట్యూట్(గైస్)లో నిర్వహిస్తున్న కెమికల్ సేఫ్టీ సూపర్‌వైజరీ కోర్సులో అడ్మిషన్లు ప్రారంభమయ్యాయి. ఈ మేరకు శుక్రవారం పరవాడలోని బైకాన్ లిమిటెడ్ కంపెనీ ఉద్యోగులు మూడు నెలల సర్టిఫికెట్ కోర్సులో చేరారు. వారికి ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ స్టడీ మెటీరియల్ అందించారు. కార్యక్రమంలో కంపెనీకి చెందిన ఈహెచ్ఎస్ హెడ్ అమరనాథ్, గైస్ కెమికల్ హెడ్ డాక్టర్ బీవీ లక్ష్మణరావు, కోర్సు కరిక్యులం కో ఆర్డినేటర్ ఎ.వరహాలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కాలభైరవ హోమం


పూజ కోసం సిద్ధం చేసిన కలశాలు

సీతమ్మధార: జీవీఎంసీ 14వ వార్డు పరిధి సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని శ్రీ మహాగణపతి ప్రసన్న వేంకటేశ్వరస్వామి, అయ్యప్ప, శ్రీ షిర్డీసాయిబాబా దేవస్థానంలో శుక్రవారం కాలభైరవ పూజలు, హోమం నిర్వహించారు. అష్టమి సందర్భంగా దేవస్థానం అర్చకుడు రాజాస్వామి పర్యవేక్షణలో పూజలు చేశారు. కార్యక్రమంలో దేవస్థానం కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్‌బాబు, సిబ్బంది శివ తదితరులు పాల్గొన్నారు.

మల్లికార్జున స్వామి కల్యాణ వైభోగం


స్వామికి నమస్కరిస్తున్న కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ

మద్దిపాలెం: జీవీఎంసీ 51వ వార్డు మాధవధార శివాలయంలో భ్రమరాంబిక సహిత మల్లికార్జున స్వామి కల్యాణాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. సింహాచలం దేవస్థానం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

దుకాణదారుడిపై అల్లరిమూక దాడి

సీతమ్మధార: ఓ దుకాణదారుడిపై ఐదుగురు యువకులు దాడికి పాల్పడిన సంఘటన ద్వారకా పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలిలా.. కె.సుబ్బరాజు అనే వ్యక్తి బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని బ్యాంక్ ఆఫ్ బరోడా బ్రాంచ్ ఎదురుగా కర్రీ పాయింట్, పండ్ల వ్యాపారం నిర్వహిస్తున్నాడు. శుక్రవారం మధ్యాహ్నం ఐదుగురు యువకులు అక్కడికి ఒక ఫ్రూట్ తీసుకొచ్చారు. దుకాణదారుడిని చాకు అడిగి తీసుకుని, ఫ్రూట్ కట్‌చేసి తిరిగి ఇచ్చారు. కవర్ కావాలని యువకులు అడగ్గా.. దుకాణ యజమాని లేవని చెప్పడంతో వెంటనే వారి మధ్య ఘర్షణ జరిగింది. యువకులు సుబ్బరాజు మొహంపై పిడిగుద్దులు గుద్దడంతో అతడు ఒక్కసారిగా వెనక్కి పడిపోయాడు. తలపై తీవ్రగాయం కావడంతో పోలీసులకు సమాచారమిచ్చారు. వారు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. సుబ్బరాజును కుటుంబ సభ్యులు అక్కడి ఆస్పత్రిలో చేర్పించగా.. ఐసీయూలో చికిత్స పొందుతున్నాడు. ఎంవీపీ సీఐ జె.మురళీ ఐదుగురు యువకులను విచారించారు. సీతంపేట రెల్లి వీధికి చెందిన వారిగా పోలీసులు గుర్తించారు.